ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
శుక్రవారం | ఆగస్టు 28, 2026 | సంపుటి : 7 | సంచిక : 77 | పేజీలు : 2

## మైన్స్ ఏడీ జయరాజు ఆస్తులు
# రూ.100 కోట్లు

- 12 చోట్ల ఏకకాలంలో ఏసీబీ సోదాలు
- మూడున్నర ఎకరాల భూమి, రూ.10లక్షల నగదు
- రూ.71లక్షల బ్యాంకు నిల్వల గుర్తింపు



2 లో

## నిర్బంధాలు, అరెస్టులతో అణిచివేయాలని చూస్తే
# ఊరుకోబోం


- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత హరీశ్ రావు
- ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం
- బీఆర్ఎస్ నేతల అరెస్టు, సుబేదారి పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

**హనుమకొండ, ఆయుధం:** విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి వారిపై పోలీసు నిర్బంధాలు, అరెస్టులతో అణచివేయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత తన్నీరు హరీశ్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళనకు వెళుతున్నారనే సమాచారంతో లా అండ్ ఆర్డర్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ పార్టీ పోలీసులు చేరుకున్నారు. బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత తన్నీరు హరీష్ రావు ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌కుమార్‌తో పాటు పలువురిని హనుమకొండ సుబేదారి పోలీసులు అరెస్ట్ చేశారు.





వివరాలు 2లో..



## విస్తీర్ణంలో తేడాలు
# పరిష్కరించండి

- రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ ఆదేశాలు

**హనుమకొండ, ఆయుధం:** భూభారతి డాటా ఆధారంగా ఎక్కడైనా 22ఎ ఎక్స్ టెంట్ లో తేడాలు వస్తే వాటిని భూభారతి పోర్టల్ లోనే పరిష్కరించాలని రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని భూభారతి, 22ఏ, సమగ్ర రీసర్వే చేసేందుకు నిర్దేశించిన అంశాల పై గురువారం రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీసీ కి జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హల్ నుండి కలెక్టర్ చాహత్ బాజ్ పాయి హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్... భూభారతి డాటా ఆధారంగా ఎక్కడైనా 22 ఎ ఎక్స్ టెంట్ లో తేడాలు వస్తే వాటిని భూభారతి పోర్టల్ లోనే పరిష్కరించాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో 22a కింద నమోదు అయినట్లు ఉంటే వాటిని గుర్తించి నిర్ణీత ప్రొఫార్మాలో తాసిల్దార్ ల నుంచి సేకరించి నివేదిక సమర్పించాలని కలెక్టర్లను సూచించారు. ఇందుకోసం స్టాండర్డ్ ఆపరేషన్ సిస్టం అమలు చేయాలని తెలియజేశారు. ఎస్ ఆర్ ఓ లో వచ్చిన ఫిర్యాదులను ఏరోజుకారోజు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామంలో సమగ్రంగా భూ రీసర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వాటి సత్ఫలితాలు ఆధారంగా అన్ని గ్రామాల్లో రీసర్వే చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ కోసం పరితపించిన వ్యక్తి..
# పెద్ది సుదర్శన్ రెడ్డి



- ఆయన పోరాటం చిరస్మరణీయం
- మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ నామకరణం చేస్తాం, వారి కాంస్య విగ్రహాన్ని నెలకొల్పుతాం
- మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత బి.వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే గండ్ర

**భూపాలపల్లి, ఆయుధం:** తెలంగాణ రాష్ట్రం కోసం పరితపించిన వ్యక్తి పెద్ది సుదర్శన్ రెడ్డి అని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత బి.వినోద్ కుమార్, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి పేర్కొన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సాధనకై అలుపెరగని పోరాటం చేసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభ వరంగల్ జిల్లా జడ్పీ మాజీ చైర్పర్సన్, భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, భూపాలపల్లి, నర్సంపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి ముందుండి పోరాటం చేశారని గుర్తు చేశారు. నిబద్ధతతో పనిచేశారు కాబట్టే ఆయన మరణించిన రోజు హరీష్ రావు, కేటీఆర్ సహా జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉన్న మాజీ మంత్రులు, నాయకులు, లక్షలాది మంది ప్రజలు తరలివచ్చారని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొట్ట మొదటి ఎన్నికల్లో పెద్ది సుదర్శన్ రెడ్డి ఓటమితో కేసీఆర్ ఎంతో బాధపడ్డారని గుర్తు చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి గెలిచి ఉంటే, బహుశా మంచి స్థానంలో ఉండి మంత్రిగా కూడా సేవలందించే అవకాశం వచ్చి ఉండేదేమో అని పేర్కొన్నారు. మన సార్ మళ్లీ రావాలని.. కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని పెద్ది సుదర్శన్ రెడ్డి ఎప్పుడూ అనే వారని నేతలు గుర్తు చేశారు. పెద్ది ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఏకతాటిపై నడిస్తే బీఆర్ఎస్ గెలుపు సులభమవుతుందని వినోద్ కుమార్, గండ్ర వెంకటరమణా రెడ్డి పేర్కొన్నారు.



## ఉద్యోగుల సమస్యలు
# పరిష్కరిస్తాం

### అందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉంది: ఎమ్మెల్యే నాయిని

**హనుమకొండ, ఆయుధం**: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలో తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలనే తనకు కూడా ఉందని, సమస్యలపై పోరాడకుండా, తప్పించుకుని తిరగడం తనకు అలవాటు లేదన్నారు. ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించిన తర్వాతే తాను ధర్నా కార్యక్రమానికి హాజరయ్యానని తెలిపారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లైన రెండో పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, పెండింగ్‌లో ఉన్న డీఏల మంజూరు, ఉద్యోగులు-పెన్షనర్ల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే శుభవార్త వస్తుందన్న నమ్మకం తనకు ఉందన్నారు. హెల్త్ కార్డులు, రిటైర్మెంట్ కు సంబంధించిన సమస్యలతో పాటు ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న ఇతర ఇబ్బందుల పరిష్కారానికి సంబంధిత మంత్రులు, ఆర్థిక శాఖతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ, ఒక్కో సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులు ఎలాంటి సమస్యను ఎదుర్కొన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే (మిగతా 2 లో..)



2 లో

## అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు
# జాబితాలో ఉండాలి

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

## ప్రతీ గ్రామం పచ్చదనం,
# పరిశుభ్రంగా ఉండాలి

- ప్రతీ గ్రామంలో వంద శాతం ఇంకుడు గుంతలు, టాయిలెట్స్ ఉండాలి
- ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**ఆత్మకూరు, ఆయుధం:** ప్రతీ గ్రామం పచ్చదనం, పరిశుభ్రంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆత్మకూరు మండలంలో పర్యటించారు. ముందుగా కొత్తగట్టు గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్ ద్వారా చేస్తున్న సేంద్రియ ఎరువు తయారీని పరిశీలించారు. ఇప్పటివరకు తయారైన ఎరువును విక్రాయించారా లేదా అని, అలాగే దాని ద్వారా వచ్చిన ఆదాయన్ని గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంను సందర్శించి అక్కడ వంట తయారీని పరిశీలించారు. పిల్లలు ఎంత మంది హాజరయ్యారని అడిగి తెలుసుకొని... అక్కడ ఉన్న పిల్లలను వివిధ రకాల పండ్ల పేర్లను అడిగి కేంద్రం లో వారికి నేర్పిస్తున్న బోధనా విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. చిన్నప్పటి నుంచే పిల్లలకి నేర్చుకోవాలన్న తపన కలగాలి అంటే.. అంగన్వాడీ కేంద్రం లో టీచర్లు ఆసక్తి కలిగేలా వివిధ రకాల ఆటపాటలతో కూడిన పాఠ్యాంశాలను బోధించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలోని 3వ తరగతిని సందర్శించి గణితంలోని కొన్ని లెక్కలను ఇచ్చి వాటిని ఆ విద్యార్థులు ఏవిధంగా చేస్తారు అని వారి అభ్యసన సామర్థ్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించి... టాయిలెట్స్ ని ప్రతీరోజు శుభ్రం గా ఉండేలా చూసుకోవాలన్నారు. నీటి వసతి, ఆర్వో ప్లాంట్ పని తీరును కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామంలో నిర్మించిన ఫామ్ పౌండ్ ను కలెక్టర్ పరిశీలించారు. గ్రామానికి చెందిన వీరబోయిన అశోక్ తన స్థలం లో నిర్మించ తలపెట్టిన ఫామ్ పౌండ్ కి భూమి పూజ చేశారు. అనంతరం కలెక్టర్ గ్రామంలో కలియ తిరిగి సోక్ పిట్స్, టాయిలెట్స్ ఉన్నాయా లేవా అని, అలాగే గ్రామంలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఇంటికి సోక్ పిట్, టాయిలెట్ ఉండాలని అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించాలని కలెక్టర్ గ్రామస్తులకు తెలిపారు వన మహోత్సవం లో భాగం గా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి కలెక్టర్ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీజ, డిఆర్డీఓ మేన శ్రీను, డిపిఓ లక్ష్మీ రమాకాంత్, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పదకొండవ రోజూ కొనసాగిన
# విద్యార్థుల నిరసన

- నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డులతో పాలిటెక్నిక్ విద్య పరిరక్షణకు డిమాండ్

**హనుమకొండ, ఆయుధం:** తెలంగాణ పాలిటెక్నిక్ జేఏసీ పిలుపు మేరకు, పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను SHAKTIలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హనుమకొండ వద్ద TP JAC వరంగల్ యూనిట్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం నాలుగో రోజూ లంచ్ విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి, చేతిలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది "పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించాలి - SHAKTIలో విలీనాన్ని నిలిపివేయాలి" అంటూ నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ ప్రత్యేకతను, స్వయంప్రతిపత్తిని కాపాడాలని, విలీన ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని TPJAC వరంగల్ యూనిట్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్య, విద్యార్థుల భవిష్యత్తు, సిబ్బంది ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వారు కోరారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం శాంతియుత నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.





- 40 లక్షల మంది విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి
- జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు

## ఫీజుల బకాయిలపై
# బీజేవైఎం లడాయి

### వరంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

**వరంగల్, ఆయుధం:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల అవలంబిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ భారతీయ జనతా యువ మోర్చా వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం కాశీబుగ్గ జంక్షన్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని రాష్ట్రంలో దాదాపు 40 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నేతలు మండిపడ్డారు. నిరంకుశ పాలన సాగిస్తూ విద్యా వ్యవస్థను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. బకాయిలు అందక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పెండింగ్‌లో ఉన్న ₹40 లక్షల మంది విద్యార్థుల ఫీజుల బకాయిలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల శ్రవణ్, ఆడెపు రవిరామ్, మున్నా, మహంత్, అభి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, జిల్లా నాయకులు అంకాల జనార్ధన్, ఇనుముల అరుణ్, మండల అధ్యక్షులు విప్ప సుధాకర్, BJYM కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

(మొదటి పేజీ తరువాయి..)

ముఖ్యమంత్రిని కలసి సమస్యపై చర్చించేందుకు తాను కూడా వారితో కలిసి వస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా, వ్యవస్థాత్మకంగా ముందుకు సాగాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉద్యోగులు వివిధ పార్టీలకు అభిమానులుగా ఉండవచ్చని, అయితే ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరిపి, సమన్వయంతో ముందుకు వెళ్తే సమస్యలు తప్పకుండా పరిష్కారమవుతాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తాను ధర్నాకు వచ్చే ముందు కూడా ప్రభుత్వ పెద్దలతో సమస్యలపై సుదీర్ఘంగా చర్చించానని, ఏ విధంగా ముందుకు వెళ్లాలి, సమస్యలను ఎలా పరిష్కరించాలి అనే అంశాలపై చర్చించిన తర్వాతే ఇక్కడికి వచ్చానని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆశీర్వాదంతో ఈ సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## కలెక్టర్, బల్దియా కమిషనర్ ను కలిసిన హార్టికల్చర్ అధికారి ప్రశాంత్

**హనుమకొండ, ఆయుధం:** బల్దియా హార్టికల్చర్ (ఉద్యానవన) అధికారిగా నూతనంగా నియమితులైన తిరునగరి ప్రశాంత్ జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్‌ను కలెక్టరేట్ లో, బల్దియా కమిషనర్ టి.వెంకన్నను బాలసముద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, కమిషనర్ ప్రశాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో పచ్చదనం పెంపు, పార్కుల అభివృద్ధి, మొక్కల సంరక్షణ, సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రశాంత్ గతంలో వరంగల్ జిల్లా పర్వతగిరి మండల వ్యవసాయాధికారిగా విధులు నిర్వహించారు.

## అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండాలి

- గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, ఆయుధం:** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్ ) ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా పూర్తి చేయడమే లక్ష్యమని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగం గ్రామ సభలను నిర్వహిస్తున్న నేపథ్యంలో... గురువారం హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరుగుతున్న గ్రామసభ నిర్వహణ తీరు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇప్పటివరకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనామలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసులు ఇచ్చార, లేదా అని బి ఎల్ ఓ బి ఎల్ ఏ, సూపర్వైజర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... డ్రాఫ్ట్ ఓటరు జాబితాను బహిరంగంగా చదివి వినిపించాలని.. మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, శాశ్వతంగా నివాసం మారిన ఓటర్ల వివరాలు, డబుల్ ఎంట్రీగా నమోదైన ఓటర్ల గుర్తింపు, గైర్హాజరైన ఓటర్ల జాబితా తదితర వివరాలను ప్రజలకు వెల్లడించాలాన్నారు. ప్రతి ఓటరు, గ్రామ ప్రజలు ఈ గ్రామ సభలను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉన్నా, పేరు తొలగింపుపై అభ్యంతరాలు ఉన్నా గ్రామ సభలోనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సరైన ఓటరు జాబితా ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలకమని, ప్రతి ఒక్కరూ SIR ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కుకు సంబంధించిన వివరాలను సరిచూసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అధికారులు తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సభల్లో BLOలు, BLA లు, సూపర్‌వైజర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది తదితర అధికారులు పాల్గొని నోటీసుల జారీ, విచారణ ప్రక్రియ, అభ్యంతరాల నమోదు విధానం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అనంతరం అదే గ్రామం లో నిర్మాణం అవుతున్న ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్ ని కలెక్టర్ సందర్శించి ఇప్పటివరకు జరిగిన నిర్మాణ పనులని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. షెడ్ నిర్మాణ పనులు వేగవంతం కావాలని... వారం రోజుల్లో రూఫ్ షీటింగ్ పనులు పూర్తి కావాలని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరి, తహసీల్దార్ జగన్ మోహన్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




## బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ ఛలో డిల్లీ

- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి

**హనుమకొండ, ఆయుధం:** కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1న సిపిఐ తలపెట్టిన ఛలో డిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ మండలంలోని గుండ్ల సింగారం సురవరం సుధాకర్ రెడ్డి నగర్ లోని ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ మండల సహాయ కార్యదర్శి గుంటీ రాజేందర్ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి తోట బిక్షపతి హాజరై మాట్లాడుతూ దేశంలో మార్పు కోసం సిపిఐ పోరాటం సాగిస్తోందని అన్నారు. బీజేపీ 12 ఏళ్ల పాలనలో ప్రజలకు ఉపయోగకరమైన ఒక మంచి పని చేయలేక పోయిందని, ధరలను అరికట్టడంలో, ఉద్యోగాల కల్పనలో విఫలమైందని అన్నారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని, సాధారణ పౌరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని, రైతాంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యము చేసి కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వడంలో విఫలమయ్యారని, రైతు సంక్షేమాన్ని దెబ్బతీశారని, ఉపాధి హామీని నిర్వీర్యం చేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశంలో ఆగస్టు 6 నుండి 14 వరకు దేశ వ్యాప్తంగా సిపిఐ ప్రచార జాత పాదయాత్ర నిర్వహించడం జరిగిందని, పాదయాత్ర జాతల ద్వారా ప్రతి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలకు వివరించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా సెప్టెంబర్ 1వ తేదీన లక్షలాది మందితో సిపిఐ ఛలో ఢిల్లీ పిలుపునివ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, నాయకులు పూజారి అమృతయ్య, కోడపాక బాబు, మామునూరి దామోదర్, కేతపాక ప్రసాద్, తాటికంటి మమత, గుంటీ రజిత తదితరులు పాల్గొన్నారు.

# నిర్బంధాలు, అరెస్టులతో అణిచివేయాలని చూస్తే ఊరుకోబోం

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత హరీశ్ రావు
- ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం
- బీఆర్ఎస్ నేతల అరెస్టు, సుబేదారి పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత



**హనుమకొండ, ఆయుధం:** విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి వారిపై పోలీసు నిర్బంధాలు, అరెస్టులతో అణచివేయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత తన్నీరు హరీశ్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ ఉద్యోగులకు హరీష్ రావు మద్దతు తెలిపారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆందోళనకు వెళుతున్నారనే సమాచారంతో లా అండ్ ఆర్డర్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ పార్టీ పోలీసులు చేరుకున్నారు. బీఆర్ఎస్ ఎల్పీ ఉప నేత తన్నీరు హరీష్ రావు ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌కుమార్‌తో పాటు పలువురిని హనుమకొండ సుబేదారి పోలీసులు అరెస్ట్ చేశారు. ఉద్యోగుల ధర్నాకు సంఘీభావం తెలిపిన తర్వాత హరీష్‌రావును అరెస్ట్ చేసే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త త వాతావరణం నెలకొంది. హరీష్ రావును సమీపంలోని సుబేదారి పోలీసు స్టేషన్ కు కాలినడకన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు సుబేదారి పీఎస్ కు తరలివచ్చి స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు.

**కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక నీతి..**

**తెలంగాణలో మరో నీతి:**

హరీశ్‌రావు పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. హనుమకొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 97 జీవోను రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థుల ఉద్యమాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఏంటని దుయ్యబట్టారు.

## మైన్స్ ఏడీ జయరాజు ఆస్తులు రూ.100 కోట్లు

- 12 చోట్ల ఏకకాలంలో ఏసీబీ సోదాలు





**భూపాలపల్లి, ఆయుధం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూగర్భ గనుల శాఖ ఏడీ జయరాజు నివాసాల్లో ఏసీబీ అధికారులు చేపట్టిన సోదాల్లో సుమారు రూ.100 కోట్ల విలువ చేసే ఆస్తులు గుర్తించారు. దీంతో ఆయనను అరెస్టు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో భూపాలపల్లి, హైదరాబాద్, సూర్యాపేట, తాండూరు సహా 12 ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం సోదాలు చేపట్టారు. ఈ క్రమంలో జయరాజుకు హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో రెండంతస్తుల భవనం, కేపీహెచ్‌బీలో ఫ్లాట్, కీసర, సూర్యాపేట, తూప్రాన్, తుంగతుర్తిలో ప్లాట్లు, సూర్యాపేటలో 3.21 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించారు.
జయరాజ్ నివాసాల్లో రూ.10 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇళ్లల్లో భారీగా గృహోపకరణాలు, రూ.71 లక్షల బ్యాంకు నిల్వలు ఉన్నట్లు తేలింది. డ్రైవర్‌కు పలు దఫాలుగా రూ.24 లక్షలు బదిలీ చేసినట్లు గుర్తించారు. ఇసుక రవాణా మామూళ్లను ఏడీ జయరాజ్ తన ఖాతాకు బదిలీ చేసినట్లు డ్రైవర్ వెల్లడించాడు. ఆ డబ్బును జయరాజు కుమార్తెకు బదిలీ చేసినట్లు తెలిపాడు. ఇటీవల ఉత్తమ అధికారిగా జయరాజు అవార్డు అందుకోవడం గమనార్హం.

## కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోడీ సర్కార్

- ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయండి




**వరంగల్, ఆయుధం:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని AITUC జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ విమర్శించారు. గురువారం సికెయం హాస్పిటల్ లోని కార్మికులతో కలిసి ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా గన్నారపు రమేష్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే 1920 అక్టోబర్ 31న ఏఐటీయూసీ ఆవిర్భవించిందని, నాటి నుంచి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి 44 కార్మిక చట్టాలను సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే 'వ్యాపారం సులభతరం' పేరుతో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడుతూ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు కరీంనగర్‌లో AITUC రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు దడిగెల సంధ్యారాణి, జిల్లా కార్యవర్గ సభ్యులు కలకోట్ల రాజు, జిల్లా సమితి సభ్యులు లావణ్య, సికెయం హాస్పిటల్ కార్యదర్శి జిల్లా సమితి సభ్యులు నాగవల్లి శంకర్, సక్కుబాయి, సులోచన, దేవేందర్, కొమ్మాలు, సుజాత, కవిత, అహల్య, రాము, సుభసిని, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి చెందిన 22 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్, ఆయుధం:** నేపాల్ వరదల పరిస్థితులపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నేపాల్‌లో తెలంగాణకు చెందిన 23 మంది చిక్కుకున్నట్లు గుర్తించామని తెలిపారు. వీరిలో ఆరుగురు రాష్ట్ర వాసులు కాగా, 17 మంది ప్రవాస తెలంగాణ వారని మంత్రి తెలిపారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ పర్యాటకుడు సురక్షితంగా ఉన్నట్లు తెలిసిందన్నారు. మిగతా 22 మంది ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు మంత్రి చెప్పారు. చిక్కుకున్నవారి వివరాలు విదేశాంగశాఖకు పంపించినట్లు పేర్కొన్నారు. కేంద్రం, నేపాల్‌లోని రాయబార కార్యాలయంతో సమన్వయం చేస్తున్నట్లు వెల్లడించారు. దిల్లీ, హైదరాబాద్‌లో హెల్ప్‌లైన్, కోఆర్డినేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

- **దిల్లీలో హెల్ప్‌లైన్ నంబర్లు: 9871999044, 9949351270, 9618597969.**
- **సచివాలయంలో హెల్ప్‌లైన్ నంబర్లు: 9885371189, 7997959754, 9440854433**

## హిందూ బంధువులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు

- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్, ఆయుధం:** భారతీయ సనాతన సంస్కృతిలో తోబుట్టువుల పవిత్ర అనుబంధానికి, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లాలోని హిందూ బంధువులకు, ప్రజలందరికీ, ముఖ్యంగా ఆడబిడ్డలకు బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ హృదయపూర్వక రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే అచంచలమైన ప్రేమను, పరస్పర రక్షణ బాధ్యతను గుర్తుచేసే గొప్ప పండుగ రాఖీ పౌర్ణమి అని కొనియాడారు. కులమతాలకు, ప్రాంతాలకు అతీతంగా సమాజంలో సోదరభావాన్ని పెంపొందించే శక్తి ఈ పండుగకు ఉందని రవికుమార్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## వరంగల్ కలెక్టర్ ను వెంటనే ప్రారంభించాలి

- సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా




**వరంగల్, ఆయుధం:** వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం అందుబాటులో లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజా సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని తక్షణమే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. శివనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జన్ను హరిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో షేక్ బాష్ మియా మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం అందుబాటులో లేకపోవడం వల్ల వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు భూ సమస్యలలు, సంక్షేమ పథకాలు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు ఇతర ప్రభుత్వ సేవలకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని తక్షణమే ప్రారంభించి పూర్తి స్థాయిలో కార్యకలాపాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను షేక్ బాష్ మియా డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హామీలను విస్మరించిందని విమర్శించారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు పూర్తిస్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్ దండు లక్ష్మణ్ మండల కార్యదర్శి గుండె బద్రి మండల సహాయ కార్యదర్శిలు జన్ను రవి పరికరాల రమేష్ నాయకులు, ల్యాధల్ల శరత్ తాళ్లపల్లి రాహేలా దగ్గు షబానా సంద్ర కుమార్ సుధీర్ జగదీష్ విక్టోరియా చంద్రశేఖర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని రేపు ధర్నా

**వరంగల్, ఆయుధం:** దేశంలో ఉన్నటువంటి మావోయిస్టు ఇతర విపుల సంస్థల నాయకులు, కార్యకర్తల పైన పెట్టిన కేసులన్నీ ఉపసంహరించుకోవాలని, కేంద్ర ప్రభుత్వం వీరందరినీ కూడా విడుదలకు రూపకల్పన చేయాలని రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక తెలంగాణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం నిర్వహించే ధర్నా పోస్టర్లను విడుదల చేశారు. మావోయిస్టులు దేశంలో లేరని కేంద్ర ప్రభుత్వమే చెప్తున్నప్పటికీ ఆ తర్వాత వాస్తవమే అయినప్పటికీ దుర్భరంగా అనుభవిస్తున్నటువంటి ఖైదీలను మరి మానవతా దృక్పథంతో విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా కాశిబుగ్గ అంబేద్కర్ సెంటర్లో APCLC వరంగల్ జిల్లా నాయకులు కంపెల్లి ప్రవీణ్ అధ్యక్షతన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని 29 నాడు జరుగు ధర్నాను జయప్రదం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్, కాశిబుగ్గ జేఏసీ నాయకులు కొంతం కృష్ణ, వెంగళ సురేష్, జంగం రాజ్ నరసయ్య, సీహెచ్.దేవయ్య, శ్యామ్, బండి కుమార్, ఐఎఫ్ టియు నాయకులు పాల్గొన్నారు.




## ఏఐకేఎంఎస్ మహాసభలను జయప్రదం చేయండి

**వరంగల్, ఆయుధం:** అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) 9వ రాష్ట్ర మహాసభలు మంచిర్యాల జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 8 9 తేదీలలో జరుగుతాయని సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు తెలిపారు. గురువారం ఖిలా వరంగల్ పంపు సెంటర్ వై జంక్షన్ నందు మహాసభల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ మహాసభల మొదటి రోజు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి అధ్యక్షతన జరుగుతుందని.. ప్రముఖ సంపాదకులు, విమర్శకులు రచయిత కే.శ్రీనివాస్ ప్రారంభ ఉపన్యాసం ఇస్తారని, ముఖ్యఅతిథిగా ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య హాజరవుతారని, వక్తలుగా జాతీయ ఉపాధ్యక్షులు రమేందర్ సింగ్, పటియాల జీవి చలపతిరావు, ఐఎఫ్టియు జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, సహాయ కార్యదర్శి అజ్మీరా లాల్, కుమార్ ప్రసంగిస్తారని ఆయన తెలిపారు. రెండవ రోజు సంస్థగత రిపోర్టు రివ్యూ నిర్మాణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని రైతు కూలీలను ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి, కోశాధికారి బండి వెంకటేశ్వర్లు, ఇనుముల కృష్ణ, బండి కుమార్, సుద్దాల వీరయ్య, ఎండి.అక్బర్ తదితరులు పాల్గొన్నారు.




## జన్ ధన్ ఖాతాల్లో రూ.3.17లక్షల కోట్లు

**జాతీయం, ఆయుధం:** దేశవ్యాప్తంగా జన్‌ధన్ ఖాతాల్లో మొత్తం డిపాజిట్లు రూ.3.17లక్షల కోట్లకు చేరాయి. 59 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలను ప్రజలు తెరిచారు. ప్రధాన్ మంత్రి జన్ ధన్ యోజన 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. ఇది బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనం అని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పేర్కొన్నారు. మొత్తం ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, నగర ప్రాంతాల్లో ఉండగా.. అందులో 56 శాతం ఖాతాలు మహిళల పేరిటే ఉండటం విశేషం. ఖాతాదారులకు ఇప్పటివరకూ 41.29 కోట్లకు పైగా రూపే డెబిట్ కార్డులు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఖాతాల ద్వారా ఉచిత ప్రమాదబీమా, పెన్షన్ సదుపాయం కల్పిస్తున్నారు. కనీస మొత్తం లేకుండానే రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, ముద్రా రుణాలు అందిస్తున్నారు. జన్ ధన్‌ఆధార్ మొబైల్ అనుసంధానం ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమ అవుతున్నాయి.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695